క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్‌కు వీడ్కోలు ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఉలవపాడు: బదిలీపై వెళుతున్న తహసీల్దార్ చంద్రారెడ్డికి బుధవారం వీడ్కోలు ఇచ్చారు. బదిలీ పై ఆయన గుంటూరు జిల్లాకు వెళుతున్నారు. దీంతో ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు. తాను పనిచేసిన కాలంలో సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. మండల పరిధిలోని వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం: మండల పరిధిలోని అంగిరేకులపాడు గ్రామశివారులోని మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. కందుకూరు సబ్ ఎస్సై దీప్తికరంత్‌కి వచ్చిన సమాచారం మేరకు ఆయన తన సిబ్బందితో కలసి పెదపవని శివారులో ట్రాక్టర్లను పట్టుకుని లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్సై బాజీబాబు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

27న మండల సర్వసభ్య సమావేశం

మర్రిపూడి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27 న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్ సుదీపా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆమె కోరారు.

క్షతగాత్రుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

వెలిగండ్ల: వెలిగండ్ల గ్రామానికి చెందిన కొడవటికంటి బాబు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చెన్నైలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఉపాధ్యాయుడు గొరిగె లక్ష్మీనారాయణ..బాబుకు రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. సర్పంచ్ తాతపూడి సురేష్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్ టి.నాని, టి. పెద్ద సురేష్ పాల్గొన్నారు.


ఘనంగా అయ్యంకి జయంతి



టంగుటూరులో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి నివాళులు

టంగుటూరు: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత అయ్యంకి వెంకట రమణయ్య 134 జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన గురించి కొనియాడారు. ఆయుర్వేద వైద్యులు ప్రియాంక, వీఆర్వో శ్రీహరి, గ్రామస్తులు జాన్ బాబు, సింగయ్య, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

207 పొగాకు బేళ్లు కొనుగోలు



టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పండుగుల్ల, చూర, ముక్క బేళ్లు 207 కొనుగోలయ్యాయి. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం, చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు పండుగుల్ల బేళ్లు 5, చూర, ముక్క బేళ్లు 243 వేలానికి ఉంచగా 207 కొనుగోలయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.208, కనిష్ట ధర రూ.135, సరాసరి ధర రూ.187 పలికింది. వేలంలో మొత్తం 16 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ముగ్గురు జూదరులు అరెస్ట్

కొండపి(సింగరాయకొండ): కొండపిలో బుధవారం జూదం(అచ్చు-బొమ్మ) ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొండపి ఎస్సై కృష్ణబాజి బాబు తెలిపారు. కొండపిలోని విష్ణు ఆలయం వెనుక జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు చెప్పారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమిద్దాం

- పార్టీ కార్యకర్తలకు అన్ని వేళలా అండగా ఉంటా
- రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి



పామూరులో నాయకులతో సమావేశమైన చింతలచెరువు సత్యనారాయణరెడ్డి

పామూరు: మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజల తరుపున అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి నాయకులు పనిచేయాలని రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి రామిరెడ్డి నివాసానికి బుధవారం వచ్చిన ఆయన స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్థితి, ప్రజాసమస్యలపై స్థానిక నాయకులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి వారికి బాసటగా నిలవాలన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ దురాగతాలను, అరాచకాలను యావత్‌దేశానికి తెలిసేలా చేసేందుకు ఢిల్లీలో ధర్నా చేసి కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ఇటీవల మండలంలో ప్రమాదాలకు గురై అనారోగ్యం చోటుచేసుకున్న వారి ఆరోగ్య స్థితిగతులపై చర్చించారు. ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండి ఎవ్వరికైనా పథకాలు రాకుండా ఉంటే వారికి న్యాయం చేసేందుకు కృషిచేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతి నాయకునికి, కార్యకర్తకు అండగా ఉంటుందన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్‌చాంద్‌బాషా, బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంచూరి సత్యంరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మరెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, మునగల రమణారెడ్డి, రంగారెడ్డి, దండు నారాయణ, తుపాకుల అంజి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బోధనా పద్ధతులు మెరుగుపర్చడమే లక్ష్యం

- ఆధునిక పద్ధతుల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు శిక్షణ
- జిల్లా విద్యాశాఖాధికారి రామారావు



మాట్లాడుతున్న డీఈఓ రామారావు

కందుకూరు: ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోధించే ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుపర్చడమే లక్ష్యంగా టీచ్‌టూల్ శిక్షణ ఇస్తున్నట్లు, శిక్షణ ద్వారా ఉపాధ్యాయుడి బోధనా నైపుణ్యాలను అంచనా వేసేందుకు ఉపయోకరంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్‌టూల్ శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఈ టీచ్‌టూల్ శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం వీరంతా ఆయా కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల బోధనను పర్యవేక్షిస్తారని చెప్పారు. దీని వల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తున్నారు, బోధనలో ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయాలను గమనిస్తామన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పరిజ్ఞానాన్ని అందించే విధంగా బోధన ఉండాలన్నారు. దీని కోసం సాంకేతిక పద్ధతులను ఉపయోగించడంతో పాటు, మెరుగైన బోధన చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్యను అందించడమే ప్రథమ లక్ష్యమన్నారు. అలాగే విద్యాశాఖ అమలు చేస్తున్న యాప్‌ల్లో సర్దుబాటు చేయాల్సిన అంశాలు ఏమైనా ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అలాగే హైస్కూల్ ప్లస్ స్కూల్‌ల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు, సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు ఆటలను పరిశీలించారు. ఆటల్లోనూ విద్యార్థులు రాణించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి సుధీర్, ఎంఈఓ కె.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం



బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేస్తున్న యూనిట్ ఇన్‌చార్జ్ వై.రంజిత్

కొండపి (సింగరాయకొండ): మండలంలోని పెరిదేపి గ్రామంలో బుధవారం రైతు సాధికారిక సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సంవత్సరం పొడవునా ఆదాయం పొందేందుకు రకరకాల కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు భూమిలో నాటారు. కుటుంబ అవసరాలకు ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు అందించేలా అందరూ పనిచేయాలన్నారు. పెరిదేపి యూనిట్‌లో కిచెన్ గార్డెనింగ్ వేయించామని దాని వలన ఇంటి వద్ద కూరగాయలు పండించుకొని ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు, డబ్బును ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో అటెండెడ్ యూనిట్ ఇన్‌చార్జి వై.రంజిత్, ఐసీఆర్‌పీఎస్ గౌతమి, సుజాత, రైతులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ దుకాణంలో చోరీ

పామూరు: స్థానిక కందుకూరు రోడ్డులో ఉన్న వాటర్‌ప్లాంట్ ముందుభాగంలో ఉన్న దుకాణంలో చోరీ జరిగిన ఘటన బుధవారం వెలుగుచూసింది. దుకాణం నిర్వాహకుడు మద్దుల వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు... ఎప్పటిలాగే మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం దుకాణంతీసి చూడగా అక్కడ ఉంచిన నగుదు రూ.12 వేలతోపాటు సిగిరెట్‌లు, ఇతర వస్తువులు రూ..5 వేల విలువచేసేవి చోరీకి గురయ్యాయన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు దుకాణం యజమాని వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా పామూరు ఇటీవల వరుస దొంగతనాలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

కేంద్రాల నిర్వహణలో సమయపాలన తప్పనిసరి



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీపీ, సూపర్‌వైజర్, కార్యకర్తలు

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కార్యకర్తలు సమయపాలన పాటించాలని బీపీసీ సామ్యేలు అన్నారు. సీఎస్‌పురంలోని ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సెక్టార్ సమావేశం సూపర్‌వైజర్ కె.దేవకపావరం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల హాజరుశాతాన్ని పెంచాలన్నారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం సకాలంలో ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల పేర్లు విధిగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని, బరువులు క్రమం తప్పకుండా నమోదుచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మూడేళ్లు నిండిన పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించి అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఈఓ రసూల్, సరళారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

28న నారాయణస్వామి ఆరాధన మహోత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 28వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, ఉదయం 9 గంటలకు పుణ్యాహవచనం, కలశస్థాపన, మహానారాయణ హోమం, నవగ్రహ హోమాలు ఉంటాయన్నారు. 11.30 గంటలకు గోపూజ, 12 గంటలకు మహానైవేద్యం, రాత్రి 7 గంటలకు పల్లకీసేవ, పంచహారతులు, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఇఓ రమణయ్య

మర్రిపూడి: చదువుతోపాటూ శారీరక దారుఢ్యానికి క్రీడలు ఎంతో ఉపకరిస్తాయని సర్పంచ్ బొట్లగుంట రాంబాబు అన్నారు. మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బుధవారం ప్రిన్స్‌పాల్ కేసీహెచ్ సీతాబాయ్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షసప్తహ కార్యక్రమాన్ని సర్పంచ్ రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. కస్తూర్బా బాలికలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. బీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంఈఓ రమణయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షా సప్తహ్‌లో భాగంగా మూడో రోజు పాఠశాల్లో బాల బాలికలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ క్రీడలు విద్యలో ఒక భాగమన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాలు మనసును ప్రశాంతంగా ఉంచుతాయన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం

హనుమంతునిపాడు: పాఠశాలలో తరగతి గదులను, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పిల్లలకు డయేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు .ఈ సందర్భంగా విద్యార్థులకు తాగే తాగునీరు, మరుగుదొడ్ల, వంటశాల, తరగతి గదులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డయేరియాపై అవగాహన కల్పించారు. తాగునీటి ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలన్నారు. బాలికలకు వివిధ సీజనల్ వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై సలహాలిచ్చారు. హెచ్ఎం బొప్పరాజు సుబ్బారావు, సీహెచ్ఓ కేవి చెన్నయ్య, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ జి.శ్రీను, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శిక్ష సప్తహ విద్యా వార్షికోత్సవాలు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ

వలేటివారిపాలెం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శిక్ష సప్తహ విద్యా వార్షికోత్సవాలు వారం రోజులు నిర్వహిస్తామని ఎంఈఓలు రవికుమార్, మల్లికార్జున్ సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొండసముద్రంలో ఎంపీపీ స్కూల్, అలాగే బండివారిపాలెంలోని పాఠశాలను ఇద్దరు ఎంఈఓలు సందర్శించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు చేశారు. అనంతరం ఫౌండేషన్ లిట్రసి అండ్ న్యూమరిసి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు గణిత భాషలోను మెళకువలను బోధించడంలో పాటు, సమాజంలో విద్యార్థులను అనుసంధానం మొదలైన కార్యక్రమాలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న ఆదిరెడ్డి, వేదికపై రంగయ్య

కనిగిరి రూరల్: గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలను, క్షేత్ర స్థాయిలో వారు పడుతున్న ఇబ్బందులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వైపీ రంగయ్య, సీహెచ్ ఆదిరెడ్డి అన్నారు. స్థానిక ఎన్జీవో భవన్‌లో బసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన వీఆర్వోల సంఘ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ ఆదిరెడ్డి, వైపీ రంగయ్య మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో వీఆర్వోలకు పనిభారం పెరిగింది వాస్తవమన్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీఆర్వోలంతా ఐక్యతగా, సమష్టిగా కలిసి ఉన్నప్పుడు సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో వీఆర్వోలు బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి జానయ్య, డివిజన్‌లో వీఆర్వోల సంఘ నాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ కవి గుర్రం జాషువా



నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, డాక్టర్ పెరుగు మురళి

కనిగిరి రూరల్: మూఢాచారాలపై, సమాజంలోని రుగ్మతలపై తన కవిత్వం ద్వారా తిరుగుబాటు చేసి, ప్రజల్లో చైతన్యం తెచ్చిన సామాజిక విప్లవ కవి గుర్రం జాషువా అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న విగ్రహానికి పలు రాజకీయపార్టీల నేతలు, ప్రజా, దళిత, బహుజన సంఘాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీ కృష్ణా, డాక్టర్ రసూల్, ఒకేరెడ్డి, మండల అధ్యక్షుడు జి.బొర్రారెడ్డి, కౌన్సిలర్లు రామన బోయిన శ్రీను, జి.అబ్రహం లింకన్, నాగూర్‌బీ, షకీల, ముద్దాబాబు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీటీఏ, దళిత, బహుజన, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘాల నాయకులు జి.రవికుమార్, దేపూరి వెంకటేశ్వర్లు, వెంగయ్య, ఎల్ ఆంథోని, న్యాయవాది బాలనారాయణ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న తహసీల్దార్లకు సన్మానం



బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

కందుకూరు: ఎన్నికల విధుల్లో భాగంగా కందుకూరు డివిజన్‌కు వచ్చి ప్రస్తుతం బదిలీపై వెళ్తున్న డివిజన్‌లోని తహసీల్దార్‌లను సబ్‌కలెక్టర్ కె. విద్యాధరి బుధవారం ఘనంగా సన్మానించారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తహసీల్దార్లు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి కృషి వల్లనే డివిజన్‌లో ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించగలిగామని చెప్పారు. ఏ ఒక్క చిన్న సంఘటన కూడా చోటు చేసుకోకుండా ఎన్నికలు జరిగాయని, దీనిలో తహసీల్దార్‌ల పాత్ర ఎంతో ఉందన్నారు. అలాగే ప్రభుత్వ విధుల నిర్వహణలో సమర్ధవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎన్నికల విధుల తహసీల్దార్‌లను ప్రభుత్వం బదిలీ చేయడంతో డివిజన్‌లోని తహసీల్దార్‌లు అంతా వారి సొంత జిల్లాలకు వెళ్తున్నారని వివరించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌లను ఘనంగా సన్మానించారు. వీరిలో కందుకూరు, ఉలవపాడు తహసీల్దార్ చంద్రారెడ్డి, గుడ్లూరు, లింగసముద్రం, వలేటివారిపాలెం, కొండాపురం, వరికుంటపాడు మండలాల తహసీల్దార్లు ఏవీ రమణారెడ్డి, శ్రీచరణ్, నాగమల్లేశ్వరరావు, మస్తాన్, అరుణాదేవి, శ్రీచరణ్‌లతో పాటు సబ్‌కలెక్టర్ కార్యాలయ డీఏఓ కె.రవిబాబు ఉన్నారు. వీరిని శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. భవిష్యత్‌లో ఎక్కడ పనిచేసినా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన చైర్మన్ గఫార్



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను కనిగిరి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ బుధవారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ సమస్యలపై వినతి పత్రం అందచేశారు. కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చే ఫైల్ వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వద్ద పెండింగ్‌లో ఉందని, అది మంజూరైయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, కనిగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రం శిథిలావస్థలో ఉన్న భవనంలో ఉందని, అలాగే మార్చురీ భవనం శిథిలావస్థలో ఉందని, వాటికి కొత్త భవనాలు మంజూరు చేయాలని, అర్ధంతరంగా నిలిచిన షెడ్యూల్డ్ తెగల బాలుర వసతి గృహం భవనాన్ని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్న చిన్న సమస్యలతో ఆగిన షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని మూసివేయకుండా తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాని కోరారు. పట్టణంలోని పలు సమస్యలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విన్నవించినట్లు తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

మర్రిపూడి: మండలంలోని జువ్విగుంట గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం కోడి పందేల స్థావరాలపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ దాడుల్లో రెండు పందెం కోళ్లు, 11 మంది జూదరులను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ శివ బసవరాజు తెలిపారు. జూదరుల వద్ద ఉన్న రూ.14,725 నగదును స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఢిల్లీ ధర్నాలో నేతలు



ఢిల్లీలో ధర్నాలో పాల్గొన్న దద్దాల నారాయణ యాదవ్, వైఎం ప్రసాద్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



ఢిల్లీలో జరిగిన ధర్నాలో పాల్గొన్న నేతలు



ఢిల్లీలో జరిగిన ధర్నాలో పాల్గొన్న కనిగిరి నియోజకవర్గ నేతలు

సింగరాయకొండ: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం చేస్తున్న హత్యా రాజకీయాలు, ఆస్తుల విధ్వంసాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో కొండపి నాయకులు పాల్గొన్నారు. కొండపి పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు చుక్కా కిరణ్ కుమార్, మసనం వెంకట్రావు, శేషయ్య, పొన్నలూరు మండల జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతి రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం చేస్తున్న మారణకాండకు, దారుణాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిలతో పాటు కనిగిరి నియోజకవర్గ పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

కందుకూరు: రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన ధర్నాలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పాల్గొన్నారు. అధికారం ముసుగులో జరుగుతున్న ఇటువంటి అరాచకాలను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసానిచ్చారు.